సాక్షి గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

శుక్రవారం । 16 । ఫిబ్రవరి । 2024

గద్దెల నుంచి గుడికి

సమ్మక్క గుడి వద్ద పొర్లుదండాలు పెడుతూ వరం పట్టిన భక్తులపై నుంచి దాటుతూ వెళ్తున్న పూజారులు



న్యూస్‌రీల్

నేటి నుంచి ఇంటర్ అథ్లెటిక్స్, ఖోఖో టోర్నమెంట్స్

కాజీపేట అర్బన్: ఈనెల 16, 17, 18 తేదీల్లో ఆల్ ఇండియా ఇంటర్ ఎన్ఐటీ అథ్లెటిక్స్ అండ్ ఖోఖో టోర్నమెంట్స్ నిర్వహించనున్నారు. ముఖ్య అతిథిగా ఇంటర్నేషనల్ అథ్లెటిక్, అర్జున అవార్డు గ్రహీత జోసెఫ్ జీ.అబ్రహాం పాల్గొని శుక్రవారం సాయంత్రం టోర్నమెంట్స్‌ను ప్రారంభించనున్నారు. నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ సారథ్యంలో నిర్వహిస్తున్న ఈటోర్నమెంట్స్‌కు దేశవ్యాప్తంగా ఉన్న ఎన్ఐటీల నుంచి 20 ఎన్ఐటీల 796 మంది విద్యార్థులు పాల్గొననున్నారు. టోర్నమెంట్స్‌కు 45 మంది నేషనల్ లెవల్ టెక్నికల్ ఆఫీసర్స్ రెఫరీలుగా వ్యవహరించనున్నారు. టోర్నమెంట్స్ చివరి రోజు 18న విజేతలకు బహుమతులు అందజేయనున్నారు.

రీ అడ్మిషన్లకు అవకాశం



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య (ఎస్‌డీఎల్‌సీఈ) డిస్ కంటిన్యూ (2018-19 నుంచి ఇప్పటివరకు) డిగ్రీ, పీజీ కోర్సుల విద్యార్థులు మళ్లీ అడ్మిషన్ పొందేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు కేయూ ఎస్‌డీఎల్‌సీఈ డైరెక్టర్ రాంచంద్రం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రీఅడ్మిషన్‌ను (2023-24) వరకు వర్తింపజేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆయా డిగ్రీ, పీజీ కోర్సుల్లో డిస్‌కంటిన్యూ అయిన విద్యార్థులు రీ అడ్మిషన్‌ను వినియోగించుకోవాలని ఆయన కోరారు. వీరికి ఇయర్‌వైజ్‌లోనే అవకాశం ఉంటుందని, ఇక 2023-24లో సెమిస్టర్ సిస్టమ్‌ను అమలు చేయబోతున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 0870 2461480, 2461490 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కాజీపేట: కార్మికుల పిల్లల స్వయం ఉపాధి కల్పన కోసం వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ పి.అశోక్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కాజీపేట విక్టరీ ఐటీఐ ఆవరణలో ల్యాండ్ సర్వేయర్, ఎలక్ట్రికల్ హౌజ్ వైరింగ్ కోర్సుల్లో మూడు నెలల పాటు నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ సమయంలో ఉచిత దుస్తులు, హెల్మెట్, పెన్నులు, పుస్తకాలు, మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన కార్మికుల పిల్లలు ఇతర వివరాలకు 99636-11239 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

నేడు ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్‌పై అవేర్‌నెస్

కేయూ క్యాంపస్: ఈనెల 16న కేయూలోని సెనేట్‌హాల్‌లో ఉదయం 11గంటలు ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ (ఐపీఆర్) అండ్ కెరీర్స్ ఇన్ ఐపీఆర్‌పై అవేర్‌నెస్ ప్రోగ్రాం నిర్వహించనున్నట్లు కేయూ ఐపీఆర్ సెల్‌నోడల్ అధికారి ఆచార్య ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎఫ్ఎస్ అండ్ గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ, భారత ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ వారి డిపార్టుమెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సంయుక్తంగా ఈకార్యక్రమం నిర్వహించనున్నారు. ముఖ్య అతిథిగా కేయూ వీసీ రమేశ్, రిజిస్ట్రార్ మల్లారెడ్డి పాల్గొంటారని తెలిపారు. అలాగే విషయ నిపుణులు ఐపీఆర్‌పై అవగాహన కల్పిస్తారని ఆయన పేర్కొన్నారు. బోధనా సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు హాజరుకావాలని కోరారు.

వరంగల్ మార్కెట్ మూడ్రోజులు బంద్



వరంగల్: దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా కార్మిక సంఘాలు పాల్గొంటున్నందున 16వ తేదీ శుక్రవారం వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో బంద్ పాటిస్తున్నట్లు ఉన్నత శ్రేణి కార్యదర్శి సంగయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 17వ తేదీ శనివారం యార్డు బంద్, 18వ తేదీ ఆదివారం వారాంతపు సెలవులు ఉన్నందున వరుసగా మూడు రోజులు మార్కెట్ బంద్ ఉంటుందని తెలిపారు. ఈవిషయాన్ని రైతులు, వ్యాపారులు, గుమస్తాలు, దడవాయి, కార్మికులు గమనించాలని కోరారు. తిరిగి సోమవారం 19వ తేదీన మార్కెట్ పునఃప్రారంభం అవుతుందన్నారు.


వరంగల్ ఆర్టీఓ బదిలీ

ఖిలా వరంగల్: వరంగల్ జిల్లా రవాణాశాఖ అధికారి రంగారావు గురువారం పెద్దపల్లి ఆర్టీఏ కార్యాలయానికి బదిలీ అయ్యారు. బుధవారం రాత్రి రవాణాశాఖ కమిషనర్ జారీ చేసిన బదిలీ ఉత్తర్వులను ఆయన అందుకున్నారు. ఆసిఫాబాద్ ఆర్టీఓగా పని చేస్తున్న బంధం లక్ష్మి వరంగల్ ఆర్టీఓగా బదిలీపై రానున్నారు.

కాళేశ్వరంపై కాగ్ అక్షింతలు

అంచనాలు మొదలు ప్రాజెక్టు పూర్తి వరకు ఉల్లంఘనలే

- వ్యయం భారీగా పెరిగినా ఆలస్యంగా పూర్తయిన బ్యారేజీలు
- లోపభూయిష్టమైన విధానాలతోనే అనర్థాలు.. ఇంకా పూర్తికాని భూసేకరణ
- ఇరిగేషన్, గత ప్రభుత్వ నివేదికలపై పెదవి విరుపు
- చర్చనీయాంశంగా కాళేశ్వరంపై 'కాగ్' నివేదిక



2022 జనవరి 25న ఆడిట్ బృందం ఉమ్మడి స్థల పరిశీలన సందర్భంగా తీసినట్లుగా కాగ్ రిపోర్టులో చేర్చిన చిత్రం

సాక్షిప్రతినిధి, వరంగల్:

అసెంబ్లీలో తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కంప్ట్రోలర్, ఆడిట్ జనరల్ (కాగ్) నివేదిక సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. కాగ్ తన నివేదికలో 2022 మార్చి నాటికి రాష్ట్ర ఆర్థిక స్థితిగతులను పేర్కొనడంతో పాటు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం, నిర్వహణ, వ్యయం తదితర అంశాలపై అక్షింతలు వేసింది. విద్య, వైద్యం, నీటిపారుదల తదితర రంగాలకు సంబంధించిన అంశాలను కూడా ప్రస్తావించినప్పటికీ, కాళేశ్వరం వ్యయం భారీగా పెరిగినప్పటికీ అదనపు ప్రయోజనం చేకూరకపోగా రూ.కోట్ల ధనం నిరుపయోగమైందని పెదవి విరిచింది.

లోపభూయిష్టమైన డిజైన్లతో నష్టం...

ప్రాజెక్టు లింకు–1 కింద, 2016 జూలై నుంచి 2021 డిసెంబర్ మధ్య మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల వద్ద మూడు బ్యారేజీలను వరుసగా 80వేల క్యూసెక్కులు, 65వేల క్యూసెక్కులు, 57వేల క్యూసెక్కుల గరిష్ట వరద విడుదలను పరిగణనలోకి రూపొందించిన ప్లాన్‌ను పరిగణనలోకి తీసుకుని నిర్మించారు. 2019 నవంబర్‌లో ఈ బ్యారేజీలకు వరద నీరు వచ్చి గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. గేట్లను మూసివేసిన తరువాత, ఆర్‌సీసీ వేసిన కోటు, సీసీ కర్టెన్ గోడలలో కొంతభాగం, దిగువ భాగంలో నిర్మించిన సిమెంట్ కాంక్రీట్ బ్లాక్‌లు కొట్టుకుపోయాయని, ఫలితంగా ఈ పనులకు చేసిన ఖర్చు వల్ల రూ.180.39 కోట్లు నష్టం వాటిల్లిందని గుర్తించినట్లు కాగ్ పేర్కొంది. విడుదలైన నీటి అధిక ఉత్సర్గ వేగం, శక్తిని తట్టుకునే విధంగా తగిన ఏర్పాటు చేయకపోవడమే ఈ నష్టానికి కారణమని సాగునీటి శాఖ చేసిన అధ్యయనాలు వెల్లడిస్తున్నాయని పేర్కొంటూ...మూడు బ్యారేజీలలోని నష్టాలను సరిదిద్దడానికి మొత్తం రూ.476.03 కోట్లకు అంచనాలను సిద్ధం చేసి సవరించిన అంచనాల్లో నీటిపారుదలశాఖ పొందుపర్చడాన్ని బహిరంగపర్చింది. సిమెంట్, కాంక్రీట్ దిమ్మెల ఆప్రాన్ లాంచింగ్‌ల రూపకల్పన లోపభూయిష్టంగా ఉండటం వల్ల, ఈ పనులు ఉత్సర్గ వేగాన్ని తట్టుకోలేక కొట్టుకుపోయాయి.. ఫలితంగా రూ.180.39 కోట్ల నష్టం వాటిల్లినట్లు తేలిందని కాగ్ పేర్కొంది.

వ్యయం పెరిగినా ఆలస్యంగా పనులు

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీ, పంపుహౌజ్‌ల నిర్మాణం పనుల వ్యయం పెరిగినప్పటికీ ఆ పనులు ఆలస్యంగా పూర్తయ్యాయని 'కాగ్'వెల్లడించింది. 2018 ఫిబ్రవరి నుంచి ఆగస్టు పూర్తి కావాల్సిన ఈ పనులు ఒక్కోటి 15 నెలల నుంచి 41 నెలల ఆలస్యంగా పూర్తయినట్లు పేర్కొంది. మేడిగడ్డ బ్యారేజీ అగ్రిమెంట్ ప్రకారం 2018 ఆగస్టు వరకు పూర్తి కావాల్సి ఉండగా 22 నెలలు ఆలస్యంగా పూర్తయినట్లు వెల్లడించింది. మేడిగడ్డ ఎత్తిపోతల 2018 ఫిబ్రవరికి బదులు 21 నెలలు, అన్నారం బ్యారేజీ 2018 ఆగస్టుకు బదులు 15 నెలలు, అన్నారం ఎత్తిపోతల 2018 ఫిబ్రవరికి గాను 21 నెలలు, సుందిళ్ల బ్యారేజీ 2018 జూలైకి గాను 41 నెలలు, సుందిళ్ల ఎత్తిపోతల 2018 ఫిబ్రవరికి బదులు 21 నెలలు ఆలస్యంగా కాంట్రాక్టు ఏజెన్సీలు పనులు పూర్తి చేశాయని కాగ్ తన నివేదికలో పేర్కొంది.

బ్యారేజీల భూసేకరణ ఇంకా పెండింగ్..

కాళేశ్వరం ప్రాజెక్టు లింకు–1 పరిధిలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల కోసం నిర్దేశించిన భూసేకరణ ఇంకా పూర్తి కాలేదని, 7,153.77 ఎకరాలకు గాను 5,240.78 ఎకరాలు సేకరించారని 'కాగ్'పేర్కొంది. భూముల ధరలు రోజు రోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ఇంకా 1,912.99 ఎకరాలను ఎప్పుడు, ఎలా సేకరిస్తారు?అని ప్రశ్నించింది. మేడిగడ్డ బ్యారేజీ కోసం 2,025.37 ఎకరాలకు 1,277.36 ఎకరాలు సేకరించగా ఇంకా 748.01 సేకరించాల్సి ఉందని నీటిపారుదలశాఖ నివేదికలో పేర్కొందని తెలిపింది. మేడిగడ్డ ఎత్తిపోతల కోసం 441.20 ఎకరాలు ఆవశ్యకత కాగా, మరో 5.10 ఎకరాలు, అన్నారం బ్యారేజీకి 569.61, సుందిళ్ల బ్యారేజీకి 590.17 ఎకరాల భూసేకరణ ఇంకా జరగాల్సి ఉందని పేర్కొంది.

విపరీతంగా పెరిగిన బ్యారేజీల నిర్మాణ వ్యయం

కాళేశ్వరం ప్రాజెక్టు లింకు–1 కింద చేపట్టిన మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల బ్యారేజీల నిర్మాణం, ఎత్తిపోతలకు వ్యయం విపరీతంగా పెరిగింది. రూ.10,783.30 కోట్లతో అప్పగించిన పనుల విలువ రూ.21,297.11 కోట్లకు చేరిందని 'కాగ్'పేర్కొంది. రీ ఇంజనీరింగ్ తర్వాత మొదట మేడిగడ్డ బ్యారేజీ పనులను రూ.1,849.31 కోట్లతో అప్పగించారు. సవరించిన అంచనాల ప్రకారం అనుబంధ ఒప్పందాలు, వర్క్‌స్లిప్‌ల ప్రకారం ఆ పనుల వ్యయం రూ.4,321.44 కోట్లకు చేరిందని 'కాగ్' తన నివేదికలో పేర్కొంది. మొత్తంగా అంచనా వ్యయం 134 శాతం పెరిగింది. అదే విధంగా మేడిగడ్డ ఎత్తిపోతల కోసం రూ.2,826.10 కోట్ల పనులను రూ.4,915.37 కోట్ల(74 శాతం)కు పెంచారు. అన్నారం బ్యారేజీ రూ.1,452.82 కోట్ల నుంచి రూ.2,565.51 కోట్ల(77 శాతం) కు, అన్నారం ఎత్తిపోతల వ్యయం రూ.1,669.23 కోట్ల నుంచి రూ.3,772.56 కోట్ల(126 శాతం)కు పెరిగిందని నివేదిక వెల్లడించింది. సుందిళ్ల బ్యారేజీ రూ.1,248.27 కోట్ల నుంచి రూ.2,148.45 కోట్ల(72 శాతం)కు, సుందిళ్ల ఎత్తిపోతలకు రూ.1,737.57 కోట్ల నుంచి రూ.3,573.78 కోట్ల (106 శాతం)కు పెరిగింది.

ప్రమాదాల నివారణలో భాగస్వాములవ్వాలి

సీపీ అంబర్ కిషోర్ ఝా



వరంగల్ క్రైం: రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ప్రజలకు సూచించారు. జనవరి 15 నుంచి ఫిబ్రవరి 14 వరకు నిర్వహించిన జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు విజయవంతంగా పూర్తయినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఈమాసోత్సవాలను పురస్కరించుకుని వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ విభాగంతో పాటు లా అండ్ ఆర్డర్ పోలీసులు పలు కార్యక్రమాలు నిర్వహించినట్లు వివరించారు. కమిషనరేట్ పరిధి హనుమకొండ, వరంగల్, జనగామ జిల్లాల్లో విద్యార్థులు, ఆటోడ్రైవర్లు, చిరువ్యాపారులు, ఆర్టీసీ డ్రైవర్లు, ట్రాక్టర్ డ్రైవర్లు, ఉద్యోగస్తులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సాధారణ ప్రజలు రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలతో పాటు పాటించాల్సిన నియమ, నిబంధనలపై అవగాహన సదస్సులు, ర్యాలీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ట్రై సిటీ పరిధి ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలున్న ప్రాంతాల్లో ముందస్తు సూచికలు, నో ఎంట్రీ సూచిక బోర్డుల ఏర్పాటు, యూటర్న్ బ్లింకింగ్ లైట్ల ఏర్పాటు, రోడ్ల మరమ్మతులు, డివైడర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాత్రి సమయాల్లో రోడ్డు ప్రమాదాలు తరచూ జరిగే ప్రాంతాల్లో రోడ్డుకు ఇరువైపులా రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈమాసోత్సవాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, వాహన పత్రాలు, లైసెన్స్‌ల తనిఖీలు ముమ్మరంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. మాసోత్సవాలను విజయవంతంగా నిర్వహించడంలో కృషి చేసిన ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీస్ అధికారులు, సిబ్బందికి సీపీ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

భక్తులకు శుద్ధ జలాలు

మేడారం మహాజాతరలో.. నిరంతరం నీటి సరఫరా

- రూ.13.45 కోట్లతో పలు పనులు
- అందుబాటులో 5,600 జీఐ షీట్స్ మరుగుదొడ్లు
- గంటగంటకు నీటి నాణ్యత పరీక్ష
- 'సాక్షి'తో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మల్లేశ్



ఎస్ఎస్‌తాడ్వాయి: 'ఈ నెల 21 నుంచి 24వరకు జరగనున్న మేడారం మహాజాతరకు తరలివచ్చే అశేష భక్తజనానికి మిషన్ భగీరథ శుద్ధ జలాలు అందిస్తాం. జాతరలో నిరంతరంగా తాగునీటి సరఫరా చేసేందుకు రూ.13.45కోట్లతో పనులు పూర్తి చేశాం' అని గ్రామీణ నీటి సరఫరా శాఖ(ఆర్‌డబ్ల్యూఎస్) సూపరింటెండెంట్ ఇంజనీర్ మల్లేశ్ తెలిపారు. మహాజాతర సందర్భంగా ఆ శాఖ ద్వారా చేపట్టిన పలు అభివృద్ధి పనులపై గురువారం ఆయన 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

రోజుకు 30 లక్షల మంది..

జాతరలో రోజుకు కనీసం 30లక్షల మంది భక్తులు తల్లుల సన్నిధికి వస్తారని అంచనాతో ఉన్నాం. వారి సౌకర్యార్థం రూ.13.45 కోట్లతో తాత్కాలిక జీఐ షీట్స్ మరుగుదొడ్లు, తాగునీటి ఏర్పాట్లు చేశాం. జంపన్నవాగులో 14 ఇన్‌ఫిల్టరేషన్ బావుల ద్వారా ఒక్కో బావికి మూడు చొప్పున 20 హెచ్‌పీ కెపాసిటీ గల మోటార్లు ఏర్పాటు చేసి నీటి సరఫరా చేస్తున్నాం. 230 చేతిపంపులు అందుబాటులో ఉన్నాయి. భక్తులకు శుద్ధి చేసిన నీటిని అందించాలనే సంకల్పంతో క్లోరినేషన్ ప్రక్రియ చేపడుతున్నాం. నల్లాల ద్వారా సరఫరా అయ్యే నీటిని గంటగంటకు పరీక్షించి పరిశుభ్రమైందా లేదా.. అనేది తెలుసుకుంటాం. 100మంది అధికారులు నిరంతరం నీటి నాణ్యత పరీక్షలు నిర్వహిస్తారు.

530 బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్

భక్తులకు నిరంతరం తాగునీటిని అందించేందుకు 539 బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్‌ను ఏర్పాటు చేశాం. భక్తులు క్రమపద్ధతిలో నిలబడి నీళ్లు పట్టుకునేలా ప్లాట్‌ఫాంలు కూడా నిర్మించాం. ప్రధానంగా జాతరలో బిగించిన నల్లాలకు పైపులైన్ ద్వారా తాగునీరు సరఫరా అవుతోంది. ఒకవేళ అకస్మాత్తుగా నీటి సఫరా నిలిచిపోయినా కూడా భక్తులు ఇబ్బందులు పడకుండా వాటర్ ట్యాంకులను కూడా సిద్ధంగా ఉంచుతాం. జాతరలో 24 గంటలకు గాను 22 గంటలు బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ ద్వారా తాగునీరు సరఫరా చేస్తాం.



మిషన్ భగీరథ నీళ్లు

మేడారం జాతరలో భక్తులకు మిషన్ భగీరథ శుద్ధ జలాలను అందిస్తున్నాం. మేడారం ఇంగ్లిష్ మీడియం సమీపంలోని ఓహెచ్ఎస్ ట్యాంక్‌కు నుంచి ఆర్టీసీ బస్టాండ్, చిలకలగుట్ట రోడ్ల వెంట, గోదావరి నీటిని భక్తులకు అందిస్తాం. అమ్మవార్ల గద్దెల ప్రాంగణంతో పాటు క్యూలైన్లలో కూడా ట్యాప్స్ ద్వారా భక్తులకు నీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

38 సెక్టార్లుగా విభజన

జిల్లా అధికార యంత్రాంగం జాతరను 38 సెక్టార్లుగా విభజించింది. మేం పది సెక్టార్లను ఏర్పాటు చేశాం. ఒక సెక్టార్‌లో నీటి సరఫరా నిర్వహణ తీరును ఒక డీఈఈ, ఇద్దరు ఏఈఈలతో పర్యవేక్షిస్తాం. జాతరలో మాశాఖ తరఫున 270 మంది అధికారులు, సిబ్బంది విధులు నిర్వహిస్తారు. జాతరలో ఏర్పాటు చేసిన తాత్కాలిక జీఐ షీట్స్ మరుగుదొడ్ల మెయింటనెన్స్‌ను జిల్లా పంచాయతీరాజ్‌శాఖకు అప్పగించాం. వారే మరుగుదొడ్ల నిర్వహణ చూస్తారు.

సకాలంలో రుణాలు మంజూరు చేయాలి

వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య



రుణ ప్రణాళికను విడుదల చేస్తున్న వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య

కరీమాబాద్ : బ్యాంకర్లు సకాలంలో రుణాలు మంజూరు చేసి ప్రజల ఆర్థికాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కలెక్టర్ పి.ప్రావీణ్య సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం జరిగిన జిల్లాస్థాయి బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. బ్యాంకర్లు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, బ్యాంకర్లతో కలిసి 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.4,891 కోట్ల రుణ ప్రణాళికను విడుదల చేశారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ కౌసల్యాదేవి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సురేష్, నాబార్డ్ జీఎం రవి, బ్యాంకర్లు సత్యం, అలీబాబా, దుర్గాప్రసాద్, శ్రీధర్‌రెడ్డి, పరిశ్రమల అధికారి నరసింహమూర్తి, పశుసంవర్ధక శాఖ జేడీ బాలకృష్ణ పాల్గొన్నారు.

బాలల సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

బాలల హక్కులు, సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం బాలల సంరక్షణ, బాలకార్మిక వ్యవస్థ ని ర్మూలన, బాలల చట్టాల అమలు తదితర అంశాల పై తీసుకుంటున్న చర్యలపై చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ సమావేశం నిర్వహించారు. మూడు నెలల కాలంలో ఐదు చైల్డ్ వెల్ఫేర్ కమిటీల ద్వారా 88 మంది బా లలకు రక్షణ కల్పించినట్లు వెల్లడించారు. సమావేశంలో డీడబ్ల్యూఓ శారద, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఓటుహక్కు నమోదు చేసుకోవాలి

వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నిక కోసం జిల్లాలోని పట్టభద్రులు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని వరంగల్ కలెక్టర్ పి.ప్రావీణ్య ఒక ప్రకటనలో కోరారు. నవంబర్ 2020 వరకు డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన పట్టభద్రులు ఓటు హక్కు నమోదుకు అర్హులని, మార్చి 14వ తేదీలోపు ఫారం–18 ద్వారా ఆన్‌లైన్, మండల రెవెన్యూ కార్యాలయం, రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వరంగల్ జిల్లాలో ఇప్పటి వరకు కేవలం 43,447 నమోదయ్యాయని, మిగిలిన వారు కూడా వెంటనే ఓటు హక్కు నమోదు చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ఏప్రిల్ 4న తుది ఓటరు జాబితా విడుదల చేస్తామని ఆమె పేర్కొన్నారు.

ఉద్యోగాలు సాధించడం హర్షణీయం

అదనపు కలెక్టర్ అశ్వినితానాజీ

కరీమాబాద్ : వరంగల్ జిల్లాలోని సంక్షేమ గురుకులాల్లో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం హర్షణీయమని అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. జిల్లాలోని ట్రైబల్ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్ గురుకులాల్లో ఉద్యోగాలు సాధించిన 42 మంది ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఉద్యోగ నియామక పత్రాలు అందుకునేందుకు గురువారం కలెక్టరేట్ నుంచి ప్రత్యేక బస్సులో హైదరాబాద్‌కు వెళ్లారు. బస్సును అదనపు కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, బీసీ, గిరిజన, సోషల్ వెల్ఫేర్ అధికారులు మనోహర్‌రెడ్డి, మల్లయ్య, సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటిని వృథా చేస్తే చర్యలు

బల్దియా ఇన్‌చార్జ్ కమిషనర్ రాధికాగుప్తా



పారిశుద్ధ్య పనులు తనిఖీ చేస్తున్న రాధికాగుప్తా

వరంగల్ అర్బన్: నగరంలో సరఫరా చేస్తున్న తాగునీటిని వృథా చేస్తే చర్యలు తప్పవని బల్దియా ఇన్‌చార్జ్ కమిషనర్ రాధికాగుప్తా హెచ్చరించారు. గురువారం బల్దియా పరిధి గోపాలపూర్ ఎక్స్‌రోడ్, ద్వారకసాయి కాలనీ, రేణుకా ఎల్లమ్మ కాలనీ, కాకతీయ యూనివర్సిటీ ఫిల్టర్ బెడ్, లార్డ్ వృద్ధాశ్రమం తదితర ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి నీటి సరఫరా, శానిటేషన్ స్థితిగతులను పరిశీలించారు. సమర్థవంతంగా నిర్వహించేందుకు తగు సూచనలు చేశారు. గోపాలపూర్ ఎక్స్‌రోడ్ ప్రాంతంలో పారిశుద్ధ్య సిబ్బంది అటెండెన్స్‌ను పరిశీలించారు. గోపాల్‌పూర్ ప్రాంతంలో స్థానికులు డ్రెయినేజీ నీరు రోడ్డుపైకి వస్తోందని ఫిర్యాదు చేయగా.. సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రేణుక ఎల్లమ్మ కాలనీలో తాగునీరు రోడ్డుపై వృథాగా పోవడాన్ని పరిశీలించిన ఇన్‌చార్జ్ కమిషనర్ నీటిని వృథా చేస్తే చర్యలు తీసుకుంటామని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం కాకతీయ ఫిల్టర్ బెడ్ నీటి సరఫరాను ఇంజనీరింగ్ అధికారులు మ్యాప్ ద్వారా వివరించారు. లార్డ్ వృద్ధాశ్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి నిర్వహణ సరిగ్గా లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సిరంగి సునీల్‌కుమార్, సీఎంహెచ్ఓ డాక్టర్ రాజేశ్, ఈఈ రాజయ్య, డీఈ రవికుమార్, శానిటరీ సూపర్‌వైజర్ నరేందర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు భీమయ్య, బాషానాయక్, ఏఈ రాగి శ్రీకాంత్, ఆర్ఐ సురేశ్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ అంతరాయం లేకుండా ఏర్పాట్లు

మేడారానికి వెళ్లే భక్తులకు నగరంలో ట్రాఫిక్ సమస్య ఎదురవకుండా ఏర్పాట్లు చేయాలని ఇన్‌చార్జ్ కమిషనర్ రాధికాగుప్తా అధికారులను ఆదేశించారు. గురువారం హనుమకొండలోని సమీకృత కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో పోలీసు, జీడబ్ల్యూఎంసీ అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఇందులో సెంట్రల్ జోన్ డీసీపీ అబ్దుల్ బారీ, ట్రెయినీ ఐపీఎస్ పండరీ చేతన్‌తో కలిసి రాధికాగుప్తా అధికారులకు పలు సూచనలిచ్చారు. ఈసందర్భంగా ఇరువురు మాట్లాడుతూ.. మేడారం వెళ్లే భక్తులకు అసౌకర్యాలు కలుగకుండా విస్తృత ఏర్పాట్లు చేయాలన్నారు. ఈసమావేశంలో ఆర్డీఓ రమేశ్, ట్రాఫిక్ ఏసీపీ భోజరాజు, ఇన్‌స్పెక్టర్లు సుజాత, శ్రీధర్, సీతారెడ్డి, బల్దియా డీసీపీ ప్రకాశ్‌రెడ్డి, ఈఈ సంజయ్‌కుమార్, ఏసీపీలు ఖలీల్, శ్రీనివాస్‌రెడ్డితో పాటు డీఈలు రవికుమార్, రవికిరణ్, ఏఈ హరికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ బోధనల్ని ఆదర్శంగా తీసుకోవాలి



జయంతి ఉత్సవాలు ప్రారంభిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ మహేందర్ జీ

హన్మకొండ: సంత్ శ్రీ సేవాలాల్ బోధనలను ఆదర్శంగా తీసుకుని యువత ముందుకు సాగాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ మహేందర్‌జీ అన్నారు. గురువారం హనుమకొండ అశోక కాలనీలోని గిరిజన భవన్‌లో సేవాలాల్ జయంతి ఉత్సవాలను ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బానోతు నవీన్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ మహేందర్ జీ ముఖ్య అతిథిగా పాల్గొని గిరిజన సంఘాల నాయకులతో కలిసి ముందుగా సేవాలాల్ చిత్రపటానికి పూలమాల వేసి జయంతి ఉత్సవాలను ప్రారంభించారు. బోగ్ బండారో నిర్వహించారు. లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోరిక ఈశ్వర్ సింగ్ నాయక్ మాట్లాడుతూ జనాభా నిష్పత్తి ప్రకారం కేంద్ర ప్రభుత్వం గిరిజనులకు 14 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భారత్ బచావో కేంద్ర సభ్యులు జై సింగ్ రాథోడ్, గిరిజన నాయకుడు ఉదయ్‌సింగ్ నాయక్, హనుమకొండ ఆర్డీఓ రమేశ్, హనుమకొండ జిల్లా గిరిజన సంక్షేమాధికారి ప్రేమ కళారెడ్డి, తహసీల్దార్ విజయ్‌కుమార్, పూజారి ధారావత్ రామచంద్ర నాయక్, గిరిజన సంఘాల నాయకులు సమ్మయ్య రాథోడ్, ప్రొఫెసర్ వీరన్ననాయక్, బానోతు జవహర్‌లాల్, పోరిక రాజ్‌కుమార్, వీరన్ననాయక్, బాదావత్ రాజు, లావుడియా వీరన్న, కాంగ్రెస్ నాయకులు విష్ణురెడ్డి, సునీల్ నాయక్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు



ఏర్పాటు చేసిన టికెట్ కౌంటర్లు, క్యూ లైన్లు

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే స్టేడియంలో ఆర్టీసీ అధికారులు మేడారం జాతరకు వెళ్లే భక్తుల కోసం గురువారం టికెట్ కౌంటర్లు, క్యూలైన్లు ఏర్పాటు చేశారు. కాజీపేట నుంచి మేడారానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ అధికారులు వేర్వేరు చోట్ల 4 టికెట్ కౌంటర్లు, క్యూలైన్లు ఏర్పాటు చేశారు.

ఆర్మీబాయ్స్ స్పోర్ట్స్ కంపెనీలో ప్రవేశాలకు ఎంపికలు

కాశిబుగ్గ : ఆర్మీబాయ్స్ స్పోర్ట్స్ కంపెనీ, ఆర్టిలరీ సెంటర్ హైదరాబాద్‌లో బాలుర ప్రవేశాలకు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు వరంగల్ జిల్లా యువజన క్రీడల అధికారి సత్యవాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 21 నుంచి 27 వరకు హైదరాబాద్ ఆర్టిలరీ సెంటర్‌లోని మకాన్‌సింగ్ అథ్లెటిక్ స్టేడియంలో అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ క్రీడలకు ఎంపికలు జరుగనున్నాయని పేర్కొన్నారు. 8 నుంచి 14 సంవత్సరాల మధ్య వయస్సు, తగిన ఎత్తు, బరువు, ఇంగ్లిష్, హిందీ భాషలు తెలిసి జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడల్లో రాణించిన వారు అర్హులని తెలిపారు. వివరాలకు 77021 55096, 99481 85608 నంబర్లలో సంప్రదించాలని ఆమె పేర్కొన్నారు.

వ్యాపార అనుసంధానంతో ప్రయోజనాలు



మాట్లాడుతున్న జె.వెంకటేశం

హన్మకొండ: స్మాల్, మీడియం, సూక్ష్మ పరిశ్రమలు, ప్రభుత్వరంగ సంస్థల మధ్య వ్యాపార అనుసంధానంతో ఇరువురికీ ప్రయోజనం చేకూరుతుందని నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎండీసీ) జనరల్ మేనేజర్ (మెటీరియల్) జె.వెంకటేశం అన్నారు. హనుమకొండ హరిత కాకతీయ హోటల్‌లో రెండ్రోజుల పాటు జరిగే వెండర్ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని గురువారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం వెంకటేశం మాట్లాడుతూ.. పబ్లిక్‌రంగ సంస్థలు, మధ్యతరగతి, స్మాల్, సూక్ష్మ స్థాయి పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) మధ్య అనుసంధానం చేయడానికి ఈకార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంఎస్ఎంఈ డైరెక్టర్ శివరామప్రసాద్ మాట్లాడుతూ.. ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ వ్యాపార వృద్ధి, వృత్తి నైపుణ్యం పెంపుదల, మార్కెటింగ్ సౌకర్యాల కల్పనకు సహకరించడంతో పాటు రాయితీ రుణాలు అందిస్తుందన్నారు.

బాలుడి ఆత్మహత్య..

● కాశిబుగ్గలో ఘటన


సాత్విక్ (ఫైల్)

కాశిబుగ్గ : తండ్రి మందలించాడనే కారణంతో ఓ బాలుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఇంతేజార్‌గంజ్ పోలీస్ స్టేషన్ పరిధి కాశిబుగ్గలో జరిగింది. సీఐ పవన్‌కుమార్ కథనం ప్రకారం గ్రేటర్ వరంగల్ 20వ డివిజన్ కాశిబుగ్గకు చెందిన మేడిపల్లి నాగరాజు, లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. నాగరాజు కాశిబుగ్గలో సెలూన్ షాపు నడుపుతుండగా, లక్ష్మి ఇళ్లలో పనిచేస్తూ సాయంత్ర సమయంలో పూలు అమ్ముతుంది. ఆ దంపతుల కుమారుడు సాత్విక్ (13) కాశిబుగ్గ నరేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతూ ఇంటింటికీ తిరిగి పూలు అమ్ముతూ తల్లికి సాయపడుతుంటాడు. ఈక్రమంలో సాత్విక్ స్కూల్‌కు సరిగా వెళ్లడం లేదు. దీంతో తండ్రి నాగరాజు సోమవారం మందలించగా మంగళవారం స్కూల్‌కు వెళ్లాడు. మళ్లీ బుధవారం సాయంత్రం మందలించగా అది మనసులో పెట్టుకున్న సాత్విక్.. గురువారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిని గమనించిన ఇంటి పక్క వారు తల్లిదండ్రులకు చెప్పగా వారు వచ్చి సాత్విక్‌ను ఎంజీఎంకు తరలించారు. వైద్యులు పరీక్షించి సాత్విక్ మృతి చెందాడని ధ్రువీకరించారు. తన కుమారుడు మృతిపై ఎలాంటి అనుమానం లేదని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కాశిబుగ్గలో విషాదం..

సాత్విక్ కాశిబుగ్గలో ఇంటింటికీ తిరుగుతూ పూలు అమ్మేవాడు. దీంతో అందరికీ సుపరిచితుడయ్యాడు. ఈ క్రమంలో సాత్విక్ మృతి చెందాడనే విషయం తెలియడంతో కాశిబుగ్గలో విషాదం నెలకొంది. కాలనీవాసులు పెద్ద ఎత్తున తరలివచ్చి సాత్విక్ మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరయ్యారు.

సమ్మక్కకు పుట్టింటి ఒడిబియ్యం


సమ్మక్కకు ఒడిబియ్యం సమర్పిస్తున్న చందావంశస్తుల పూజారులు


అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించేందుకు వస్తున్న మంత్రి సీతక్క

● సమర్పించిన చందావంశీయులు
● జాతరకు వారం ముందు తీసుకురావడం ఆనవాయితీ



ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం సమ్మక్కకు పుట్టింటి (చందా వంశీయులు) వారు ఒడిబియ్యం, పట్టుచీర సమర్పించారు. బయక్కపేట గ్రామానికి చెందిన చందా వంశస్తులు మహాజాతర సందర్భంగా పుట్టింటి ఒడిబియ్యం తీసుకుని మేడారానికి చేరుకున్నారు. డోలువాయిద్యాల నడుమ పూజారులు సమ్మక్క గద్దె వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి ఒడి బియ్యం పోసి పట్టు చీర సమర్పించారు. సారలమ్మకు పూజలు చేశారు. సమ్మక్క పుట్టినిల్లు బయ్యక్కపేట అని చరిత్రలో ఉంది. జాతరకు వారం రోజులు ముందు చందావంశ పూజారులు పుట్టింటి ఒడిబియ్యం సమర్పించడం ఆనవాయితీ అని తెలిపారు. కార్యక్రమంలో పూజారులు చందా పరమయ్య, చందా బాబురావు, చంద్రశేఖర్, స్వామి, రఘుపతిరావు, చందా గోపాల్‌రావు, కల్యాణ్, నవీన్ పాల్గొన్నారు.

అమ్మవార్లకు చందన సుగంధ మాలలు, పట్టువస్త్రాలు

జాతీయ మిర్చి టాస్క్ ఫోర్స్ డైరెక్టర్ నాసిరెడ్డి సాంబశివరెడ్డి కేరళ రాష్ట్రం నుంచి ప్రత్యేకంగా తయారు చేయించి తెప్పించిన చందన మాలలు సుగంధ హారాలు, పట్టు వస్త్రాలను రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క చేతుల మీదగా వనదేవతలకు సమర్పించారు. తల్లులకు సుగంధ హారాలు, చందన మాలలు, పట్టు వస్త్రాలు సమర్పించడం సంతోషంగా ఉందని సాంబశివరెడ్డి పేర్కొన్నారు.

40వేల మంది భక్తుల రాక..

మేడారం సమ్మక్క, సారలమ్మను దర్శించుకునేందుకు గురువారం భక్తులు భారీగా తరలివచ్చారు. తెలుగు రాష్ట్రాల్లో నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి ప్రైవేటు వాహనాల్లో వేలాది మంది తరలివచ్చారు. జంపన్నవాగులో స్నానాలు ఆచరించి పుట్టు వెంట్రుకలు సమర్పించుకున్నారు. అమ్మవార్ల గద్దెలకు చేరుకుని పసుపు, కుంకుమ, ఎత్తు బంగారం, కోళ్లు, యాట మొక్కులను చెల్లించుకున్నారు. భక్తుల రద్దీతో గద్దెల ప్రాంగణం సందడిగా మారింది. సుమారు 40వేల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నట్లు అధికారులు అంచనా వేశారు. మొక్కుల అనంతరం చెట్ల కింద విడిది చేసి వంటావార్పు చేసుకుని సహపంక్తి భోజనాలు చేశారు.

గద్దెల నుంచి గుడికి..

● అమ్మవార్లకు గురువారం ప్రత్యేక పూజలు
● ముగిసిన మండమెలిగె పూజా కార్యక్రమాలు

ఎస్ఎస్ తాడ్వాయి : మేడారంలో మండమెలిగె పూజా కార్యక్రమాలు గురువారంతో ముగిశాయి. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పూజలు నిర్వహించి రాత్రి సమయంలో మేడారం నుంచి సమ్మక్క, కన్నెపల్లి నుంచి సారలమ్మ పూజారులు గద్దెలకు చేరుకున్నారు. రాత్రంతా గద్దెల వద్ద జాగారంతో సంబురాలు నిర్వహించారు. గురువారం ఉదయమే సమ్మక్క పూజారులు గద్దెపై అమ్మవారి పూజా సామగ్రిని తీసుకొని గుడికి చేరుకున్నారు. పూజారులు వచ్చే దారిలో మహిళలు నీళ్లరగించి పూజలు చేశారు. గుడికి చేరుకున్న అనంతరం పూజారులు అమ్మవారికి పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. సారలమ్మ పూజారులు కూడా కన్నెపల్లికి చేరుకొని సారలమ్మకు పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. బుధవారం రాత్రి మంత్రి సీతక్క మండమెలిగె పండుగకు హాజరయ్యారు.


సమ్మక్క గద్దె నుంచి గుడికి వెళ్తున్న పూజారులు

తల్లులకు జీవితాంతం సేవ చేస్తా



మాట్లాడుతున్న మంత్రి సీతక్క

● జాతర విజయవంతానికి ప్రతి ఒక్కరూ సహకరించాలి
● రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క

ఎస్ఎస్‌తాడ్వాయి : ఈ ప్రాంత ఆదివాసీ ఆడబిడ్డగా సమ్మక్క, సారలమ్మకు జీవితాంతం సేవ చేస్తానని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క అన్నారు. గురువారం మేడారంలోని ఆదివాసీ భవనంలో నిర్వహించిన జాతర ఉత్సవ కమిటీ ప్రమాణస్వీకారోత్సవానికి మంత్రి సీతక్క ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జాతరలో భక్తుల సౌకర్యార్థం ప్రభుత్వం కేటాయించిన రూ. 105 కోట్లతో ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. అమ్మవార్ల గొప్పతనాన్ని ప్రపంచం నలుమూల చాటి చెప్పడానికి అందరం కలిసి జాతరను విజయవంతం చేద్దామన్నారు. జిల్లాలో మొదటిసారి జాతర ఉత్సవ కమిటీ చైర్మన్‌తోపాటు డైరెక్టర్లను నియమించుకోవడం శుభపరిణామన్నారు. ప్రభుత్వం కేటాయించిన ప్రతి పైసా జాతర అభివృద్ధికి ఖర్చుచేస్తున్నామని, మిలిగిన నిధులు కూడా జాతర అనంతరం శాశ్వత అభివృద్ధి పనులకు ఖర్చు చేస్తామన్నారు. జాతరకు కేటాయించిన ప్రతి పైసాకు జవాబుదారీగా ఉంటామన్నారు. జాతర ఉత్సవ కమిటీ చైర్మన్, డైరెక్టర్లు పూజారుల అభిప్రాయాలను గౌరవించి సమన్వయంతో జాతరను విజయవంతం చేయాలన్నారు. కష్టపడి పని చేసిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు లభిస్తుందన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావించి జాతర విజయవంతానికి కృషి చేస్తుంటే కొందరు కావాలని జాతరపై రాజకీయం చేస్తున్నారన్నారని, వాస్తవాలు గుర్తించాలన్నారు. జాతర ఉత్సవ కమిటీ చైర్మన్ లచ్చుపటేల్ మాట్లాడుతూ తన ఉద్యమ కష్టానికి గుర్తింపుగా మంత్రి సీతక్క.. జాతర చైర్మన్‌గా నియమించనందుకు ప్రత్యేక అభినందలు తెలిపారు. కార్యక్రమంలో ఈఓ రాజేంద్రం, పూజారుల సంఘం అధ్యక్షుడు, ఎక్స్ అఫిషీయో సభ్యుడు సిద్ధబోయిన జగ్గారావు, పూజారులు కాక వెంకటేశ్వర్లు, సిద్ధబోయిన స్వామి, దేవాదాయ శాఖ సూపరింటెండెంట్ క్రాంతికుమార్, జూనియర్ అసిస్టెంట్లు రాజేశ్వర్‌రావు, జగదీశ్, మధు, బాలకృష్ణ, రఘుపతి పాల్గొన్నారు. కాగా, మంత్రి సీతక్క, జాతర ఉత్సవ కమిటీ చైర్మన్ లచ్చుపటేల్, ఎక్స్ అఫిషీయో సభ్యుడు, పూజారుల సంఘం అధ్యక్షుడు జగ్గారావుతోపాటు, కమిటీ సభ్యులను పూజరులు సన్మానించారు. అలాగే, మంత్రి సీతక్కను పార్టీ శ్రేణులు, చైర్మన్ లచ్చుపటేల్‌ను పార్టీ జిల్లా అధ్యక్షుడు పి. అశోక్, ప్రజాప్రతినిధులు సన్మానించారు. ఈకార్యక్రమానికి ముందు ఉత్సవ కమిటీ చైర్మన్ లచ్చుపటేల్, కమిటీ సభ్యులు, పూజారులు కలిసి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అసెంబ్లీలో మన సభ్యుల గళం

సాక్షి, హైదరాబాద్: శాసనసభలో గురువారం రెండు గంటల పాటు జీరో అవర్ నిర్వహించి కొత్త శాసనసభ్యులు మాట్లాడేందుకు అవకాశం కల్పించారు. కొన్నేళ్లుగా శాసనసభ సమావేశాల్లో జీరో అవర్‌కు అవకాశం ఉండటం లేదు. ప్రస్తుత సభలో కొత్త సభ్యులు ఎక్కువ మంది ఉన్నందున, వారికి నియోజకవర్గం గురించి మాట్లాడే అవకాశం కల్పించాలన్న ఉద్దేశంతో ఉదయం 10 నుంచి 12 వరకు జీరో అవర్ కొనసాగించారు. నియోజకవర్గానికి సంబంధించి ఒక సమస్యను మాత్రమే ప్రస్తావించాలని స్పీకర్ పదేపదే చెప్పినా, సభ్యులు చాలా అంశాలను ప్రభుత్వం దృష్టికి తెచ్చేందుకు పోటీపడటం విశేషం.

వరంగల్‌ను దత్తత తీసుకోండి : నాయిని (వరంగల్ పశ్చిమ)

వరంగల్ మహానగరాన్ని దత్తత తీసుకుని గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన పాపాలను కడగాలి. వరంగల్‌ను ఆరు జిల్లాలుగా విభజించి 20 ఏళ్లకు వెనక్కి నెట్టారు. వరంగల్ నగరం వరదలో ముంపుకు గురైనప్పుడు మాజీ మంత్రి కడియం శ్రీహరి ఎక్కడికి పోయారు. ఎంజీఎం ఆస్పత్రిని అభివృద్ధి చేయకపోగా, చారిత్రక సెంట్రల్ జైలును తరలించి చరిత్రను తుడిచేశారు.

పాల సేకరణ బిల్లులివ్వటం లేదు: పల్లా రాజేశ్వర్‌రెడ్డి (జనగామ)

రెండు నెలలుగా పాల ఉత్పత్తిదారులకు పాల సేకరణ కేంద్రాల ద్వారా డబ్బులు రావటం లేదు. పాలు సేకరించిన తర్వాత క్వాలిటీ ఉండటం లేదన్న పేరుతో తిప్పి పంపుతుండటంతో రైతులు నష్టపోతున్నారు. ఇతర ఖర్చులు ఆపైనా సరే పాల ఉత్పత్తిదారుల బకాయిలు చెల్లించాలి. వీరికి గత ప్రభుత్వం పెంచిన బోనస్ మేరకు డబ్బులు చెల్లించటం లేదు.

2 లక్షల ఉద్యోగాల జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి: పాడి కౌశిక్‌రెడ్డి (హుజూరాబాద్)

కేసీఆర్ ప్రభుతం కల్పించిన ఉద్యోగాలకు సంబంధించి అభ్యర్థులకు పత్రాలు ఇవ్వటం కాదు, 2 లక్షల కొత్త ఉద్యోగాల భర్తీకి సంబంధించి ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి.

మాకూ కాళేశ్వరం నీళ్లు వచ్చేలా చూడండి : గండ్ర సత్యనారాయణ రావు (భూపాలపల్లి)

కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి మా నియోజకవర్గంలో ఒక్క ఎకరాలకు కూడా నీళ్లు రావటం లేదు. మాకు కూడా నీళ్లు వచ్చేలా చర్యలు తీసుకోవాలి. భారీ వర్షాలకు 124 చెరువులు తెగి ఆరుగురు వ్యక్తులు చనిపోయారు. 1100 మూగజీవాలు కూడా చనిపోయాయి. ఆ చెరువులకు మరమ్మతు చేసి, బాధిత కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వాలి. సింగరేణి ఆసుపత్రిలో సిబ్బంది లేరు, ఏమాత్రం వసతులు లేవు.

ల్యాండ్ పూలింగ్ జీఓ రద్దుచేయాలి : కేఆర్ నాగరాజు (వర్ధన్నపేట)

వర్ధన్నపేట నియోజకవర్గంలో విలీన గ్రామాల అభివృద్ధికి గత ప్రభుత్వంలో నాయకులు అక్రమంగా రైతులను హింసించి ల్యాండ్ పూలింగ్ చేసిన జీఓ రద్దు చేయాలి. దీనివల్ల రైతులకు చాలా అన్యాయం జరుగుతుంది.

ఉద్యమకారుడు రాజయ్య కన్నుమూత

● పలువురు రచయితలు, కవుల సంతాపం


నల్లెల్ల రాజయ్య (ఫైల్)



మలిదశ తెలంగాణ ఉద్యమంలో రాజయ్య. (ఇన్‌సెట్‌లో)

హన్మకొండ కల్చరల్ : తెలంగాణ ఉద్యమకారుడు, కవి, రచయిత, పౌర స్పందన వేదిక ప్రధాన కార్యదర్శి నల్లెల రాజయ్య (62) కన్నుమూశారు. ఇటీవల అనారోగ్యానికి గురైన ఆయన.. హైదరాబాద్‌లోని కిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. రాజయ్యకు భార్య సుగుణమ్మ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. నల్లెల్ల రాజయ్య ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ములుగు మండలం అబ్బాపూర్‌లో రైతు కుటుంబంలో జన్మించారు. విద్యార్థి దశలోనే నాస్తికత్వం, సామాజికత్వం, ఉపాధ్యాయ, ప్రజాఉద్యమాలకు ప్రభావితులయ్యారు. హసన్‌పర్తి మండలం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేసి 2020లో ఉద్యోగ విరమణ చేశారు. వరంగల్ రచయితల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడిగా సంఘం ద్వారా అనేక సాహిత్య కార్యక్రమాలు నిర్వహించారు. సమాజ మార్పు కోసం నిత్యం పోరాడిన వ్యక్తి రాజయ్య.. పద్మాక్షి గుట్ట దగ్గర జరిగే అసాంఘిక కార్యకలాపాలపై పలుమార్లు అధికారులకు విజ్ఞప్తులు అందజేశారు. కాళోజీ కళాక్షేత్రం జాప్యంపై పలుమార్లు గత ప్రభుత్వంపై నిరసన తెలియజేశారు.

రచనలు..

తెలంగాణ మట్టి పాటలు, తెలంగాణ జంగ్, ఆశయాల పందిరి, ధిక్కారం, అనుగ్రలు, బహిష్కారం, భూమి దుఃఖం, మా ఊరి పెద్ద దర్వాజ, మోటబొక్కెన, నిప్పుల సముద్రం ఇంద్రవెల్లి, వింటిని గురిపెట్టు, ఐ కాంట్ బ్రీత్, చావైనా.. రేవైనా... తదితర రచనలు చేసి పుస్తకావిష్కరణలు చేశారు. 2007లో తెలంగాణ మలిదశ ఉద్యమంలో తెలంగాణ ఐక్య కార్యాచరణ కమిటీలో చేరి ఉద్యమంలో పాల్గొన్నారు. అలాగే, దేవాదుల ప్రాజెక్టు కోసం తవ్వకాలు జరుపుతున్న క్రమంలో రామప్ప పరిరక్షణ కమిటీ ద్వారా భారత పురావస్తుశాఖ ఢిల్లీ వారికి ఫిర్యాదు చేసి సొరంగ తవ్వకాలను ఆపివేయడంలో కీలక పాత్ర పోషించారు.

పలువురు సంతాపం..

రాజయ్య మృతిపై అరసం వరంగల్ జిల్లా అధ్యక్షుడు నిధి బ్రహ్మచారి మాట్లాడుతూ రాజయ్య ఎక్కడ అన్యాయం జరిగినా ఒంటరిగా వెళ్లి పోరాటం చేసిన సందర్భాలు ఉన్నాయని, ఆయన సహచర్యం, సహకారం ఎవరూ పూరించలేనిదన్నారు. తెరసం కార్యదర్శి బిల్ల మహేందర్ మాట్లాడుతూ దివ్యాంగుల హక్కుల గొంతుక రాజయ్య మృతి దివ్యాంగుల సమాజానికి తీరనిలోటన్నారు. తెలంగాణ ప్రజాఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి రమాదేవి మాట్లాడుతూ ఉద్యమాలలో పాల్గొంటూనే వివిధ వర్గాల సమస్యల సాధనలో ముందుడేవాడన్నారు. పౌర స్పందన వేదిక సభ్యుడు చీకటి రాజు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ప్రతి సోమవారం గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదులు ఇచ్చేవారని తెలిపారు. పౌరహక్కుల వేదిక జీవన్‌కుమార్, రచయిత్రి కాత్యాయని విద్మహే, కేయూ ప్రొఫెసర్ బన్న ఐలయ్య, కవయిత్రి అనిశెట్టి రజిత, నాగిళ్ల రామశాస్త్రి, తెరసం బాధ్యుడు పొట్లపల్లి శ్రీనివాసరావు, సభ్యులు నెల్లుట్ల రమాదేవి, హాజీనురానీ, బాలబోయిన రమాదేవి, ఉదయశ్రీ ప్రభాకర్, వకులవాసు, సిరాజుద్దీన్, కుమారస్వామి ఉమా, అరుణ, భూషణ్ రవిచంద్ర, చందు వల్లంపట్ల నాగేశ్వరరావు, బిల్ల మహేందర్, తదితరులు రాజయ్యకు నివాళులర్పించారు. హైదరాబాద్ నుంచి గురువారం ఉదయం హనుమకొండ పద్మాక్షికాలనీలోని తన నివాసానికి రాజయ్య పార్థివదేహం తీసుకువచ్చి సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు.

రైతు దిక్సూచి ఆకాశవాణి..

● ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకుడు ఉమారెడ్డి


కిసాన్ దివస్‌లో పాల్గొన్న ఉమారెడ్డి, ఆకాశవాణి కేంద్రం అధికారులు, రైతులు

హన్మకొండ: రైతు దిక్సూచి ఆకాశవాణి కేంద్రమని వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకుడు డాక్టర్ ఉమారెడ్డి అన్నారు. గురువారం హనుమకొండలోని ఆకాశవాణి వరంగల్ కేంద్రంలో కిసాన్ దివస్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉమారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. ఆకాశవాణి ప్రసారం చేసే వ్యవసాయ కార్యక్రమాల గురించి రేడియోలో వినడం వల్ల ప్రయోజనాల గురించి తెలిపారు. సంప్రదాయ, శాస్త్రీయ పద్ధతుల ద్వారా పంటలు పండించే విధానాలను రేడియో ద్వారా రైతులు తెలుసుకుంటున్నారన్నారు. ఈ సందర్భంగా రైతులు అడిగిన సమస్యలు, సందేహాలను నివృత్తి చేశారు. రేడియోలో ప్రసారమయ్యే వ్యవసాయ కార్యక్రమాలను విని అనేక మంది రైతులు ప్రయోజనం పొందుతున్నారన్నారు. ఆకాశవాణి కేంద్రం కార్యక్రమ నిర్వహణాధికారి ఇల్లందుల రవికుమార్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 15వ తేదీని రేడియో కిసాన్ దినోత్సవం ఘనంగా జరుపుకుంటామన్నారు. అనంతరం వరంగల్ ఆకాశవాణి కేంద్రం కిసాన్ వాణి వ్యాఖ్యాతలు డాక్టర్ పసుల ఎల్లయ్య, పింగిలి కుమార్, పంకజ్ మోహన్, మోటె చిరంజీవి, అర్షం సదానందంతో పాటు నిష్ణాతులైన, అభ్యుదయ, ఆదర్శ రైతులకు మెమోంటో, ప్రశంస పత్రం, బహుమతి అందించి సన్మానించారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం ప్రిన్సిపల్ సైంటిస్ట్ ఎస్.రాజన్న, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు అవినాష్ వర్మ, పశు వైద్య కళాశాల అసోసియేట్ డీన్ ఎం.శ్రీనివాసరెడ్డి, వరంగల్ ఆకాశవాణి ఇంజనీర్ వి.రామ్ రెడ్డి, సిబ్బంది నరేష్, కుమారస్వామి, శివశంకర్, శ్రీనివాసాచార్య, అనిల్ ప్రసాద్, శ్రీనివాస రాజు, ఉషశ్రీ, బాలరాజు, రామమూర్తి, నరేష్ కుమార్, విజయలక్ష్మి, రామమోహన్, చందు పాల్గొన్నారు.

రేపు కేయూకు త్రిసభ్య విచారణ కమిటీ

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో ఆర్ట్స్, సోషల్ సైన్స్, సైన్స్, ఫార్మసీ, ఇంజనీరింగ్, కామర్స్‌అండ్ బిజినెస్‌మేనేజ్‌మెంట్, ఎడ్యుకేషన్, లా విభాగాల్లో కొన్నినెలల క్రితం పీహెచ్‌డీ అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహించారు. అయితే ఇందులో అక్రమాలు జరిగాయని పలువురు విద్యార్థులు, విద్యార్థి సంఘాల నేతలు ఆరోపిస్తూ ఫిర్యాదు చేయగా ఇటీవల ప్రభుత్వం తిసభ్య విచారణ కమిటీని నియమించిన విషయం విధితమే. ఈవిచారణ కమిటీలో తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ వెంకటరమణ, సీపీగేట్ కన్వీనర్ ప్రొఫెసర్ పాండురంగారెడ్డి, టెక్నికల్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు ఉన్నారు. ఈనెల 17న ఆ త్రిసభ్య విచారణ కమిటీ కాకతీయ యూనివర్సిటీకి రానుంది.ఈ మేరకు యూనివర్సిటీ అధికారులకు గురువారం సమాచారం అందింది. తొలుత ఈనెల 14న విచారణ కమిటీ రానుందని సమాచారం ఇచ్చినా అనివార్యకారణాలతో ఆ కమిటీ రాలేదు. ఈనెల 17న రానుంది.

ఇది విచారణ కమిటీ షెడ్యూల్ ..

కేయూలోని ఆయా విభాగాల్లోని పీహెచ్‌డీ అడ్మిషన్ల ఆరోపణలపై త్రిసభ్యకమిటీ ఈనెల 17న ఉదయం 10.30 నుంచి 11గంటల వరకు ప్రిలిమినరీగా వీసీ తాటికొండ రమేష్‌తో చర్చించనున్నారు. ఉదయం 11.15 నుంచి 12.15 గంటల వరకు సంబంధిత అధికారులతో ప్రిలిమినరీగా చర్చిస్తారు. సెషన్ –1లో మధ్యాహ్నం 12.30 నుంచి మధ్యాహ్నం 1.15 గంటలవరకు విచారణ కమిటీ స్టేక్‌హోల్డర్స్‌తో చర్చిస్తుంది అలాగే, కమిటీ ప్రాతినిధ్యాలు కూడా స్వీకరించనుంది. మధ్యాహ్నం 1.15 నుంచి 2.15 గంటల వరకు విచారణ కమిటీకి లంచ్ విరామ సమయం ఉంటుంది.సెషన్–2లో 2.15 నుంచి 3.30 గంటల వరకు స్టేక్‌హోల్డర్లతో కమిటీ చర్చించనుంది. అలాగే ప్రాతినిధ్యాలు కూడా స్వీకరిస్తుంది. మధ్యాహ్నం 3.45 నుంచి 4గంటల వరకు కమిటీ విచారణకు సంబంధించిన అంశాలపై సమ్మింగ్ అప్ చేయనుంది.

ఆన్‌లైన్ మోసం..

● బ్యాంకు ఖాతా నుంచి రూ.95 వేలు మాయం
● హనుమకొండ పీఎస్ పరిధిలో ఘటన
● పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

వరంగల్ క్రైం : హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని నయీంనగర్‌కు చెందిన పాడిశెట్టి రాముడు ఆన్‌లైన్‌లో హెర్బల్ లైఫ్‌ప్రాడక్ట్స్ బుక్ చేసుకున్నాడు. ఈ క్రమంలో ఇటీవల ఆ ప్రొడక్ట్స్ ఎక్కడ వరకు వచ్చాయో సంబంధిత వెబ్ సైట్‌లో పొందుపరిచిన నంబర్‌కు ఫోన్ చేశాడు. ఆన్‌లైన్‌లో గుర్తుతెలియని వ్యక్తులు మీ ప్రొడక్ట్స్ రావాలంటే రూ. 5 పంపించాలని చెప్పడంతో రూ. 5 పంపించాడు. ఆ తరువాత అతడి అకౌంట్ నుంచి రూ.50 వేలు ఒక్కసారి, రూ.45 వేలు మరోసారి మొత్తం రూ. 95 వేలు డ్రా అయ్యాయి. దీంతో బాధితుడు లబోదిబోంటూ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సతీష్ పేర్కొన్నారు.

మద్యం మత్తులో ఒకరిపై దాడి

ఖిలా వరంగల్: మద్యం మత్తులో ఓ వ్యక్తి అతివేగంతో ఒకరిని ఢీకొట్టాడు. ఇదేంటని ప్రశ్నిస్తే బెదిరించాడు. ఈఘటన వరంగల్ ఫోర్ట్ రోడ్డు వజ్రా వైన్స్ ఎదుట గురువారం రాత్రి జరిగింది. పోలబోయిన సంతోశ్ అతిగా మద్యం సేవించి బైక్ నడుపుతూ.. ద్విచక్ర వాహనంపై వెళ్తున్న సత్యనారాయణను బలంగా ఢీకొట్టాడు. స్వల్ప గాయలతో బయటపడిన సత్యనారాయణ ఏదేంటని సంతోష్‌ను ప్రశ్నించగా.. దుర్భాషలాడుతూ దిక్కున చోట చెప్పుకో అంటూ బెదిరింపులకు పాల్పడ్డాడు. బాధితుడు ఈవిషయాన్ని మిల్స్‌కాలనీ పోలీసులకు తెలుపగా.. ఘటన స్థలికి ఎస్సై గోవర్ధన్ చేరుకున్నారు. స్థానిక ప్రజల నుంచి వివరాలు సేకరించారు. సత్యనారాయణ ఫిర్యాదు మేరకు సంతోశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గోవర్ధన్ తెలిపారు.

లీకు వీరులపై విచారణ?

● సామాజిక మాధ్యమాల్లో సర్కారుకు ఫిర్యాదు
● స్టాంప్‌వెండర్ విభాగ అధికారిపై వేటు?

సాక్షి ఎఫెక్ట్..

వరంగల్ క్రైం: 'అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)లో లీకు వీరులు' శీర్షికన గురువారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనం ఆ శాఖలో కలకలం రేపింది. ఇటీవల ఏసీబీ అధికారుల ఆపరేషన్ ఫెయిల్ కావడానికి గల కారణాలు, సమాచారం ముందుస్తుగా లీకు చేసే వీరులు ఎవరనే దానిపై తీవ్ర స్థాయిలో చర్చ సాగింది. నగరానికి చెందిన ఓ సామాజిక కార్యకర్త.. అవినీతి నిరోధక శాఖ డైరెక్టర్ సీవీ ఆనంద్‌కు ఎక్స్(ట్విట్టర్) వేదికగా సాక్షి కథనాన్ని ట్యాగ్ చేయడంతో ఆయన స్పందించినట్లు సమాచారం. వరంగల్ ఏసీబీ కార్యాలయం నుంచి సమాచారం అందించిన అధికారులపై విచారణ చేసి చర్యలు ఉంటాయని ఎక్స్‌లో పేర్కొన్నట్లు తెలిసింది. స్టాంప్స్, రిజిస్ట్రేషన్ డీఐజీ మాదాసి సుభాషిణి కూడా 'సాక్షి' కథనంపై ఆరా తీశారు. జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వచ్చి ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. కొంతమంది ఉద్యోగుల కారణంగా శాఖ పరువు పోతుందని, వారు పద్ధతి మార్చుకోకుంటే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. సదరు స్టాంప్ వెండర్ సెక్షన్ అధికారిపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేయడంతోపాటు అతన్ని కొడకండ్ల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి బదిలీ చేసినట్లు తెలిసింది.